## క్లుప్తంగా

### నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా

ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా

**పెద్దశంకరంపేట(మెదక్):** పంచాయతీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధిపై గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ, వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఈజీఎస్ పనులు, నర్సరీ నిర్వహణ, పన్నుల వసూలు తదితర అంశాలపై కార్యదర్శులకు పలు సూచనలిచ్చారు. ప్రత్యేకాధికారులతో కలిసి పనులు చేపట్టాలని ఆదేశించారు.

### పనులు పూర్తి చేయాలి

ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా

**శివ్వంపేట(నర్సాపూర్)** గ్రామాల్లో నిర్దేశించిన పనులను సిబ్బంది వేగవంతంగా పూర్తిచేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌గుప్తా, ఎంపీఓ తిరుపతిరెడ్డి ఆదేశించారు. మండలంలోని ఎదుల్లాపూర్, గూడూర్ గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉదయం వేళల్లోనే ఉపాధి పనులు చేయించాలని సూచించారు. నర్సరీలో పూర్తిస్థాయిలో మొక్కలను పెంచాలని, విధులపై నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట కార్యదర్శి రాఘవేంద్ర భట్టాచార్యులు తదితరులు ఉన్నారు.

### వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

**కొల్చారం(నర్సాపూర్):** మండలంలోని పైతర గ్రామంలో రెండు రోజులుగా కొనసాగుతున్న భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ వేడుకలలో భాగంగా మంగళవారం వైభవంగా రథోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు మంగళ హారతులతో స్వాగతం పలికారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు.

### ఎల్‌ఓసీ పంపిణీ



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఆవుల రాజిరెడ్డి

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన అయ్యారి వేదవతికి ఆపరేషన్ కోసం రూ.1.10లక్షల ఎల్‌ఓసీ మంజూరు కావడంతో కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మంగళవారం ఆమెకు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రఘు, కార్యదర్శి బాలాగౌడ్, కృష్ణ, నగేశ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

### నల్లపోచమ్మకు జాతర కమిటీ పూజలు



**కౌడిపల్లి(నర్సాపూర్):** తునికి నల్లపోచమ్మ దేవిని జాతర కమిటీ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. 28 నుంచి జరిగే జాతర కోసం దేవదాయశాఖ తాత్కాలిక కమిటీ నియమించిన విషయం తెలిసిందే. దీంతో మంగళవారం ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పురోహితుడు శివప్ప, కమిటీ సభ్యులు తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పర్వతాలు, ప్రభాకర్‌చారి, నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, సునీత, భిక్షపతి, రాములు, మహేందర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులను ఈఓ సన్మానించారు.

# ఎండిన పంటలకు నష్టపరిహారం

ఎమ్మెల్యే సునీతారెడ్డి



పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

**నర్సాపూర్ రూరల్:** ఎండిన వరి, మొక్కజొన్న పంట రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఎల్లారెడ్డిగూడ, జయరాంతండాలలో పర్యటించి ఎండిన పంటపొలాలను పరిశీలించి రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు వట్టిపోవడంతోపాటు లోఓల్టేజి సమస్య కారణంగా పంటలు ఎండిపోయాయని వాపోయారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎండిన పంటలను వ్యవసాయ అధికారులతో అంచనా వేయించి ఎకరాకు రూ.25వేల చొప్పున ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇవ్వకపోవడంతో రైతులు పెట్టుబడి కోసం అప్పులు తెచ్చుకొని ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేయకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని సునీతారెడ్డి హెచ్చరించారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సైతం సరఫరా చేయకపోవడంతో అనేక గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

**కారు గుర్తుకే ఓటేయాలి..**

రైతుబంధుతో పాటు రుణమాఫీ చేస్తామని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని సునీతారెడ్డి రైతులకు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు రూ.లక్ష రుణమాఫీ, ఎకరాకు రూ.15వేల రైతుబంధు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. రైతులు ఇప్పటికైనా కళ్లు తెరిచి వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్ శేఖర్, శివ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, అశోక్ గౌడ్, జీవన్‌రెడ్డి, షేక్ హుస్సేన్, బిక్కు నాయక్, జగపతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు కులమతాలు కొలబద్దలు కావు

మాధవానంద స్వామి



మాట్లాడుతున్న మాధవానంద స్వామి

**కొల్చారం(నర్సాపూర్):** విద్యను పొందేందుకు కులమతాలు ఏమాత్రం కొలబద్దలు కావని, మానవతా ధర్మాలే ప్రధానమైనవని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి పేర్కొన్నారు. మంగళవారం రంగంపేటలోని సరస్వతీ మందిరం వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, సరస్వతీ మాత స్తుతితో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపీఠం ద్వారా దేశంలో శిశు మందిరాలు కొనసాగడం, వాటి ద్వారా విద్యార్థులు సంస్కారవంతమైన వ్యక్తులు తయారై ఉన్నత స్థాయిలో కొనసాగడం మనం చూస్తున్నామన్నారు. తల్లిదండ్రులు అలాంటి విద్యను తమ పిల్లలకు నేర్పే విద్యాసంస్థల వైపు పయనింపజేయాలని సూచించారు. విద్యాపీఠం ప్రతినిధి వెంకటరామ్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి పేరుగా కొనసాగుతున్న శిశు మందిరాలను మరింత విస్తరింపచేందుకు విద్యాపీఠం పనిచేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. వివిధ విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు సంగారెడ్డికి చెందిన కానుగంటి రాజు స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యుడు నవీన్ కుమార్, కార్యవర్గ అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, రమేశ్‌బాబు, బాలరాజ్, నర్సింహులు, కుమార్, నరేశ్, గోపాల్‌రెడ్డి, పెద్ది మల్లేశం, మహేశ్, మధుసూదన్ రెడ్డి, ఆచార్యులుహేమలత, పావని తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో సీపీఐ నేత మృతి



దుర్గయ్య (ఫైల్)

**నర్సాపూర్ రూరల్:** గుండెపోటుతో సీపీఐ రైతు కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, పార్టీ మండల కార్యదర్శి జాజల దుర్గయ్య గుండెపోటుతో మృతి చెందారు. స్వగ్రామమైన నత్నాయ్య పల్లిలోని తన ఇంట్లో మంగళవారం మృతి చెందినట్లు ఆ పార్టీ నేతలు తెలిపారు. జిల్లా కార్యదర్శి టీఎం కాలేక్ తదితరులు మాట్లాడుతూ దుర్గయ్య దివంగత మాజీ ఎమ్మెల్యే చిరుముల విఠల్ రెడ్డి అనుచరుడిగా కొనసాగి పలు భూ పోరాటాలు చేశారన్నారు. 40ఏళ్లకు పైగా పార్టీలో ఉంటూ సేవలు చేశారని గుర్తుచేసుకున్నారు. దుర్గయ్య మృతికి ఆయా పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు. కౌన్సిల్ సభ్యుడు రాజాగౌడ్, నాగరాజ్, శివ కుమార్, మాజీ సర్పంచ్ పరమేశ్వర్ రాజు, నాయకులు ఉదయ్, పోచన్న తదితరులు దుర్గయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## అర్హులకు జీరో బిల్లులు రావడంలేదు

ఎంపీటీసీ నాగులు



మాట్లాడుతున్న ఎంపీడీవో షాజిలొద్దీన్

**రామాయంపేట(మెదక్):** గృహలక్ష్మి పథకానికి అర్హులైన కొందరికి జీరో విద్యుత్ బిల్లులు రావడంలేదని ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు అధికారుల దృష్టికి తెచ్చారు. మంగళవారం ఎంపీపీ భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో విద్యుత్‌శాఖ ఏఈ పెంట్యానాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో గృహలక్ష్మి పథకానికి సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ ఆసుపత్రి పరిధిలో అందుతున్న వైద్యసేవలను వివరించారు. ఆసుపత్రిలో ప్రతినెలా విధిగా డెలివరీలు చేయిస్తున్నామన్నారు. మేకలు, గొర్రెల కోసం కొందరు డబ్బులు చెల్లించి ఏడాది గడిచినా ఇంత వరకు మంజూరు కాలేదని ఎంపీటీసీ నాగులు సభ దృష్టికి తెచ్చారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని వెటర్నరీ డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. ఎంపీడీవో షాజిలొద్దీన్ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చిన అంశాలకు సంబంధించిన వివరాలు వచ్చే సమావేశంలో సభ ముందుంచుతామన్నారు. ప్రసుత్తం గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పాలన కొనసాగుతోందని, గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ మాట్లాడుతూ వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటడంతో ఈసారి పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు. రైతుబంధుకు సంబంధించి 12,238 మంది రైతులకు గాను రూ.7.44కోట్లు జమ చేశారని వ్యవసాయ అధికారి తెలిపారు.

### బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

**రామాయంపేట(మెదక్):** మండలంలోని కోనాపూర్ చిన్నతండాలో బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. తండాకు చెందిన 14 ఏళ్ల బాలికకు ఆమె పెద్దలు ఇటీవల నిశ్చితార్థం జరిపించారు. సమాచారం అందుకున్న పోలీసులు తండాకు వెళ్లి ఆమె సభ్యులతో మాట్లాడారు. అయినా ఖాతరు చేయకుండా పెళ్లికి ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో సమాచారం అందుకున్న తహసీల్దార్ రజని కుమారి, ఎస్‌ఐ రంజిత్, ఎంపీడీవో షాజిలొద్దీన్ తండాకు వెళ్లి విచారించారు. బాలికను తీసుకెళ్లి మెదక్‌లోని చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని బాలసదన్‌లో అప్పగించారు. బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

### అక్రమ మద్యం పట్టివేత



బెల్ట్‌షాప్‌పై దాడి చేసిన పోలీసులు

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నామని ఎస్‌ఐ షేక్‌మహబూబ్ చెప్పారు. మండలంలోని చిట్కుల్ గ్రామంలో మంగళవారం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై దాడి చేసిన పోలీసులు అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన పాతార్‌పల్లి అంజయ్య అక్రమంగా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో అతని దుకాణంపై దాడిచేసి రూ.3వేలు విలువచేసే మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సుధారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రమాదాల్లో 13 మందికి గాయాలు



మెదక్ మున్సిపాలిటీ: సత్యవ్వను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

**రామాయంపేట(మెదక్):** జిల్లాలో జరిగిన మూడు వేర్వేరు ప్రమాదాల్లో మొత్తం 13 మంది గాయపడ్డారు. రామాయంపేట శివారులో కోమటిపల్లి స్టేజీ వద్ద జాతీయ రహదారిపై ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ్డ ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. దళితవాడకు చెందిన వారు చేగుంట మండలం కర్నాల్‌పల్లివద్ద విందుకు వెళ్లి వస్తుండగా, ఈ ప్రమాదం సంభవించింది. ఆటోలో ఉన్న కుందెన లక్ష్మి, సత్యనారాయణ, సత్తమ్మ, వడ్ల ముత్యాలు, బాగయ్యతోపాటు మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే తొనిగండ్లవద్ద కారు బోల్తాపడ్డ ఘటనలో నలుగురు గాయపడ్డారు. మెదక్‌కు చెందిన వారు కారులో రామాయంపేటవైపు వస్తుండగా తొనిగండ్లవద్ద కారు బోల్తా పడింది. మెదక్ దుర్గా కాలనీకి చెందిన వల్లెపు శ్రీను, దండెపు ఎల్లేశ్ మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఆర్టీసీ బస్సు ఢీకొని..**

**మెదక్ మున్సిపాలిటీ:** పట్టణ శివారులోని మాతా శిశు ఆస్పత్రి గేటు జరిగిన మరో ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన తలారి సత్యవ్వ ఆస్పత్రి వద్ద తాను ఎక్కిన బస్సు దిగుతుండగా ప్రమాదవశాత్తు తన కాళ్లపై నుంచి బస్సు వెళ్లింది. పోలీసులు అక్కడికి చేరుకొని సత్యవ్వను ఆస్పత్రికి తరలించారు.

## సంక్షిప్త వార్తలు

◆ **లింగారెడ్డిపేట్‌లో చోరీ**

**మనోహరాబాద్(తూప్రాన్):** మండలంలోని లింగారెడ్డిపేట్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మన్నె రాజు ఇంట్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. రూ.50 వేల నగదు, 4 మొబైల్ ఫోన్లు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డిని వివరణ కోరగా తనకు ఏలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

◆ **శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి**

**చేగుంట(తూప్రాన్):** పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ బాలరాజు పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌తోపాటు హిందువుల ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. ఎంపీపీ మాసుల శ్రీనివాస్, జింక శ్రీనివాస్, ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **ప్రజల సహకారం అవసరం**

**రేగోడ్(మెదక్):** ప్రతీ ఒక్కరూ నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్థానిక ఎస్‌ఐ రాజయ్య కోరారు. మండలంలోని గజ్వాడ, టి.లింగంపల్లి గ్రామాల్లో మంగళవారం సీఐఎస్‌ఎఫ్ పోలీసు బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే పార్లమెంటు ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

◆ **భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యం**

**మనోహరాబాద్(తూప్రాన్):** నిత్యం మద్యం తాగి వస్తున్న భర్తను ప్రశ్నించడంతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయిన భర్త అదృశ్యమయ్యాడు. స్థానిక ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దొంతి రమేశ్, తన భార్య సునీతతో కలసి నాలుగేళ్ల క్రితం బతుకు తెరువుకు మనోహరాబాద్ మండలం జీడిపల్లి వచ్చాడు. స్థానిక పరిశ్రమలలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 25న రమేశ్ మద్యం తాగి రావడంతో భార్యభర్తలకు గొడవ జరిగింది. దీంతో అతడు వెళ్లిపోయాడు. భార్య సునీత వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ **బీజేపీ పరిస్థితిపై మంత్రి ఆరా**

**నర్సాపూర్:** భారతీయ జనతాపార్టీ పరిస్థితులపై రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చర్చించినట్టు ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంటు కోఆర్డినేటర్ రమేశ్‌గౌడ్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కిషన్‌రెడ్డి రాష్ట్రంలోని నియోజకవర్గాల కోఆర్డినేటర్లతో చర్చించి పార్టీ పరిస్థితుల గురించి తెలుసుకున్నారన్నారు. తాను జహీరాబాద్ నివేదిక అందజేశానని రమేశ్‌గౌడ్ చెప్పారు.

## ఘనంగా ఆలయాల వార్షికోత్సవం

పూజల్లో పాల్గొన్న నాయకులు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**కౌడిపల్లి(నర్సాపూర్):** శివపంచాయతన నవగ్రహ దేవత సమేత ఆంజనేయస్వామి, పోచమ్మదేవి, రేణుక ఎల్లమ్మదేవి ఆలయాల ప్రథమ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ఆధ్వర్యంలో పురోహితుడు కొలాచల రాజేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆయా ఆలయాలలో దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆంజనేయస్వామికి 14వేల తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం చేశారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాధవానంద సరస్వతీ స్వామి మాట్లాడుతూ లోకం సుభిక్షంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు పూజలు చేయాలన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్త, ఎంపీటీసీ మంజూల శివాంజనేయులు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ చిన్న చిన్నంరెడ్డి, మాజీ సర్పంచ్ పెద్ద చిన్నంరెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, రాజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సంతోష్‌గౌడ్, శ్రీనివాస్, నర్సింగరావు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## కాండం తొలుచు పురుగు ఉధృతం



వరిని పరిశీలిస్తున్న ఏఓ స్వప్న

ఏఓ స్వప్న

**కౌడిపల్లి(నర్సాపూర్):** వరిలో కాండం తొలుచు పురుగును నివారించుకోవాలని ఏఓ స్వప్న సూచించారు. మంగళవారం మండలంలోని మహ్మద్‌నగర్‌లో రైతు భూదయ్య వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట చిరుపొట్టదశ, గింజ పాలుపోసుకునే దశలో ఉందన్నారు. పంటను కాండం తొలుచు పురుగు ఆశిస్తోందన్నారు. నివారణ కోసం ఎకరాకు ప్రొఫినోఫాస్ 400మిల్లీ లీటర్లు, లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ 400గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయడం ద్వారా పురుగు ఉధృతిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. రైతులు ప్రతి రోజు పంటను గమనించి జాగ్రత్తలు పాటించాలన్నారు. సమస్య ఉంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, రైతు భూదయ్య పాల్గొన్నారు.

## రూ.50వేలు దాటితే సీజ్

**చిన్నశంకరంపేట(మెదక్):** నార్సింగి మండల కేంద్రంలో ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దిన్ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వల్లభాపూర్ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌తోపై అధికారుల ఆదేశానుసారం వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. వాహనదారులు రూ.50వేల కన్నా ఎక్కువ నగదు తరలిస్తే సరైన పత్రాలు తమతోపాటు ఉంచుకోవాలని సూచించారు. లేని పక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

**మద్యం తరలిస్తే చర్యలు**

**అల్లాదుర్గం(మెదక్):** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. అల్లాదుర్గం శివారులో 161జాతీయ రహదారిపై ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి సిబ్బందితో మంగళవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలలో మద్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపులలో మద్యం విక్రయిస్తే కేసులు తప్పవని చెప్పారు.



చిన్నశంకరంపేట(మెదక్): వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ అహ్మద్ మోహినొద్దిన్

**హెల్మెట్ తప్పనిసరి**

**టేక్మాల్(మెదక్):** మండల పరిధిలోని బొడ్మట్‌పల్లిలో మంగళవారం టేక్మాల్ ఎస్‌ఐ మురళీ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతీ వాహనదారుడు ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు వల్ల నియమావళిని అందరూ పాటించాలన్నారు. ఆయన వెంట ఏఎస్‌ఐ తుక్కయ్య, సిబ్బంది కంఠేశ్వర్, రవీందర్, శ్రీనివాస్ ఉన్నారు.

## వేతన ఒప్పందం అమలు కావడంలేదు



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

- బీఎంఎస్ నేత ప్రదీప్‌కుమార్
- పరిశ్రమ ఎదుట కార్మికుల నిరసన

**చేగుంట(తూప్రాన్):** వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని బీఎంఎస్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వడియారం అపోలో ట్యూబ్స్ పరిశ్రమ వద్ద ఆయన కార్మికులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం ఏడాదిగా వేతన సవరణ అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను అమలు చేస్తామని యాజమాన్యం హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా అమలుకు నోచుకోలేదని వాపోయారు. వేతన సవరణ అమలు చేయకుంటే కార్మికుల పక్షాన ఉద్యమం ఉధృతం చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ కార్మిక సంఘం నాయకులు రామస్వామి, నర్సింహులు, తోన నర్సింహారెడ్డి, గణపతి, శ్రీనివాస్, సత్యం, సతీశ్, సత్యనారాయణగౌడ్, చంద్రం, రామకృష్ణ, నరేశ్ కార్మికులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

**చేగుంట(తూప్రాన్):** మండలంలోని మక్కరాజీపేటలో జరిగిన ఇఫ్తార్ విందులో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించామన్నారు. అన్ని వర్గాల ప్రజల పండుగలకు కేసీఆర్ సముచిత న్యాయం కల్పించారన్నారు. మాజీ సర్పంచ్ శ్రీనివాస్, విశ్వేశ్వరరావు, ముస్లింలు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

**నర్సాపూర్:** నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవంగా జరిగాయి. బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఇక్బాల్ అలీ జాఫర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ప్రభు, కోశాధికారిగా సుధాకర్, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీగా బాలకృష్ణ ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా అంజిరెడ్డి, ఖాజా మోహినోద్దీన్, శంకర్ రెడ్డి, ఏ శ్రీనివాస్, శ్రీనివాస్, ప్రకాశ్ ఎంపికయ్యారు.